

కుంటను తలపిస్తున్న మాధాపురం బడి

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: దేవరుప్పులలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని మాధాపురం ఉన్నత పాఠశాల ఆవరణ కుంటను తలపిస్తోంది. దీంతో బుధవారం ఉదయం నుంచి విద్యార్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దోమలకు ఆవాసంగా మారే ఆస్కారం ఉందని, నీరు నిలువకుండా జిల్లా విద్యాధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

పౌరసేవలోకి కొత్త వాహనాలు



నూతన ట్రాక్టర్ ట్రాలీకి టైర్లను మారుస్తున్న సిబ్బంది

జనగామ, న్యూస్‌టుడే: ఇంటింటి నుంచి చెత్త తరలింపునకు కొనుగోలు చేసిన మూడు ఆటోలు, ఒక ట్రాక్టర్ వాడకంలో పురపాలిక జాప్యం చేస్తున్న తీరుపై 'పారిశుద్ధ్య వాహనాల వాడకంపై మల్లగుల్లాలు' శీర్షికన ఈ నెల 21న ప్రచురితమైన కథనానికి పాలక వర్గం స్పందించింది. ట్రాక్టర్ టైర్ల నాణ్యత విషయంలో కథనంలో ప్రచురితమైన వివరాలతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ట్రాక్టర్ ట్రాలీ వెనుక టైర్ల స్థానంలో అవసరమైన పరిమాణంలో ఉన్న టైర్లను బిగించారు. ఆటోలను, ట్రాక్టర్‌ను బుధవారం పౌర సేవలకు ఉపయోగించారు. నిబంధనలకు విరుద్ధంగా డ్రైవర్ల నియామకానికి రాయ'బేరాల'కు జరిగిన ప్రయత్నాల గురించి ప్రస్తావించడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు.

ఈనాడు కథనానికి స్పందన



వర్షాల వేళ.. ఒడిసిపడదాం!



ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వ ఉత్తర్వులు

దాహం వేసినప్పుడే ఆలోచిద్దామా..?

ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి.. నీరంతా వృథాగా సముద్రం పాలవుతోంది.. కాంక్రీట్ వనంలో చుక్క నీరు కూడా ఇంకడం లేదు.. మళ్లీ వేసవి వచ్చేవరకు తాగునీటికి కటకటే.. అప్పుడు ఇంకుడు గుంతలు గుర్తుకొస్తాయి.. దాహం వేసినప్పుడే.. బావి తవ్వితే ప్రయోజనం ఉంటుందా..? మరేం చేద్దాం..!

ఇదే తరుణం...

తాజాగా వాన నీటిని ఒడిసిపట్టి.. భూగర్భ జలాల పెంపునకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నడుం బిగించింది. అన్ని పురపాలికలు, నగరపాలక సంస్థల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడు గుంత ఉండాలని ఉత్తర్వులు వెలువరించింది.. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగంతో పాటు ఇటు పౌరులూ కదలాలి.

న్యూస్‌టుడే-డోర్నకల్, కార్పొరేషన్, జనగామ

పౌరుల మేలుకొలుపు కోసం..!

నగర పాలక సంస్థతో పాటు పురపాలికల్లో పౌరుల మేలుకొలుపు కోసమన్నట్లు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. జల శక్తి అభియాన్ పథకం కింద 'క్యాచ్ ది రెయిన్' పిలుపుతో ఈ కార్యాచరణ అమలు చేశారు. డోర్నకల్‌లో మున్సిపల్ పాలకవర్గం, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

భవనాల నిర్మాణాలకు అనుమతిచ్చేటప్పుడే ఇంకుడుగుంత ఉండేలా తప్పని చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు విధివిధానాలను పొందుపర్చింది. ఇప్పటికే ఉన్న భవనాల్లోనూ నిర్మించాలి. విద్యా సంస్థలు ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, అపార్టుమెంట్లు, ప్రైవేటు వాణిజ్య భవనాల్లోనూ తప్పనిసరి. బడా భవనాలకు ఆక్యుపెన్సీ కమ్ కంప్లీషన్ సర్టిఫికెటు ఇచ్చే ముందు ఇంకుడుగుంత నిర్మించారో లేదో అధికారులు పరిశీలించాలి.

డిపాజిట్ వెనక్కి తీసుకున్నవారే లేరు..

భవన నిర్మాణ అనుమతి రుసుములో ఇంకుడు గుంతల డిపాజిట్ చెల్లించి, నిర్మాణం పూర్తయిన పిదప, ఇంకుడు గుంతల డిపాజిట్ రుసుమును వెనక్కి తీసుకోవచ్చు. కానీ, పురపాలికల్లో ఇంకుడు గుంతలు నిర్మించి, రుసుము వెనక్కి తీసుకున్న దాఖలాలు తక్కువే..

బాధలన్నీ గట్టెక్కాయి..



ఈ దంపతుల పేర్లు ధారియా-రామిని... మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చాప్లాతండా వాసులు. వీరింట్లో బోరు నుంచి అంతంతమాత్రంగానే నీరు వచ్చేది. ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాక ఇంటి అవసరాలకు సరిపడా నీరొస్తోంది.. ఇంట్లో వాడిన నీళ్లు నేరుగా ఇంకుడు గుంతలోకి వెళ్తుండటంతో దోమలు, విష పురుగుల బాధ తప్పింది.

మూలుగుతున్న రూ.5 కోట్లు

ఇంకుడు గుంతల నిర్మాణం కోసం గ్రేటర్ వరంగల్ డబ్బులు వసూలు చేసింది. బిల్డింగ్ పర్మిషన్ ఫీజుతో పాటు వాటర్ హార్వెస్టింగ్ ఛార్జీలు తీసుకున్నారు. నివాస గృహాల నుంచి రూ.5 వేలు, అపార్టుమెంట్లు, వ్యాపార, వాణిజ్య భవనాల నుంచి రూ.10వేల పైనే వసూలు చేశారు. 2003 నుంచి నిధులను ప్రత్యేక ఖాతాలో జమ చేశారు. ఇలా రూ.5 కోట్ల నిధులు మూలుగుతున్నాయి. 2013, 2018లో స్పెషల్ డ్రైవ్ ద్వారా కొంతమంది యజమానులు ఇంకుడు గుంతలు నిర్మించినా అసంపూర్తిగా వదిలేశారు.

కానరాని చైతన్యం

పట్టణ ప్రజల్లో చైతన్యం కానరావడం లేదు.. భవన నిర్మాణం జరిగిన చోటల్లా ఇంటి ఆవరణ లేదా పరిసరాల్లో ఇంకుడు గుంత నిర్మాణమనేది నామ మాత్రంగా కనిపిస్తోంది.. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో మూడు నెలల క్రితం అధికారులు ఇంటింటా సర్వే చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 300 చదరపు మీటర్లు దాటిన గృహాలు 11,588 ఉన్నాయి. ఇందులో 6,973 ఇళ్లు సర్వే చేయగా.. కేవలం 789 ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించగా 768 వాడకంలో ఉండగా, 21 నిరుపయోగంగా ఉన్నాయి. 6184 ఇళ్లలో లేవని తేలింది.

ఇలా నిర్మిద్దాం

ఇంట్లో వాలు స్థలం ఎంపిక చేసుకోవాలి. అనువైన పొడవు, వెడల్పుతో 2 మీటర్ల లోతు గుంత తవ్వాలి. అడుగు భాగాన సగభాగం 40 మి.మీ కంకర, తర్వాత పావు భాగం 20 మి.మీ కంకర నింపాలి. గుంత కొంత భాగం ఖాళీగా ఉండేలా చూసుకొని దొడ్డు ఇసుకతో నింపాలి. తర్వాత వర్షపు నీటి పైపును ఇంకుడు గుంతలోకి మళ్లించాలి. ఇళ్లలో ఖాళీగా ఉన్న బోర్లను కూడా ఇంకుడు గుంతలా చేసి నీటిని మళ్లించవచ్చు.



ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ

పట్టణాల్లో ఆవాసాలు
3,51,768

అపార్టుమెంట్లు
687

ఇంకుడు గుంతలు
2146



జనగామ మండలం సిద్దెంకిలో నాటు దశలో ఎండిన వరి

నత్తనడకన సాగుతోంది

జనగామ రూరల్, న్యూస్‌టుడే: కరవు, దుర్భిక్షమైన జనగామ ప్రాంతంలో వేలాది ఎకరాల్లో పంటల సాగుకు విరామం ఏర్పడింది. జిల్లాలో 2017 నుంచి ప్రతి యేటా పంటల విస్తీర్ణం సాగు అంచనాకు మించి క్రమక్రమేనా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల వల్ల పంటల సాగు అందుకోలేకపోయింది. జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, కంది, మొక్కజొన్న పండిస్తున్నారు. ఓ మోస్తారు, భారీ వర్షాలు కురిసినా సకాలంలో లేకపోవడంతో సాగు విస్తీర్ణం అంచనాకు చేరుకోలేకపోవడంతో అనేక మంది రైతులకు నిరాశనే మిగిల్చింది. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 20 వేల ఎకరాలకు పైగా పంటలకు విరామం ఏర్పడింది. ఈ యేడు చోటు చేసుకున్న విభిన్న పరిస్థితులపై 'న్యూస్‌టుడే' కథనం.

వివరాలిలా..

పంట	2023 సంవత్సరం	2024 సంవత్సరం
వరి	2,18,998	2,06,305
పత్తి	1,24,300	1,22,471
కంది	2591	2223
మొక్కజొన్న	3040	2995
ఇతర పంటలు	2739	4683

వేసిన పంటలు దక్కని దుస్థితి..

జిల్లా వ్యాప్తంగా ప్రధాన పంటలు వరి, పత్తి, కంది, మొక్కజొన్న, ఇతర పంటలు సాగవుతున్నాయి. వానలు లేక నత్తనడకన సాగవుతోంది. పత్తి పంట జూన్, జులైలోగా వేసుకోవాల్సి ఉండగా, ఆగస్టు మొదటి వారం వరకు వేసుకున్నారు. వరి పంట జూన్ నుంచి ఆగస్టు మొదటి వారం నాట్లు వేసుకోవాల్సి ఉండగా, సెప్టెంబరు మాసంలో నాట్లు వేసుకుంటున్నారు. ఆలస్యంగా ఒకటి, రెండు భారీ వర్షాలతో కష్టతరంగానే ఉన్నా, చాలా వరకు విరామం ఏర్పడిందని అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యంగా సాగైన పంటలు సైతం దక్కే పరిస్థితి కనిపించడం లేదు. ఓ వైపు వరుణుడు కరుణించకపోవడంతో బోర్లు, బావుల్లో నీరు అడుగంటిపోయింది. మరో వైపు రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు, దేవాదుల కాలువల నుంచి నీరందే పరిస్థితులు లేకపోవడంతో కర్షకులు అతి కష్టం మీద పండిస్తున్నారు. నీటి సౌలభ్యం లేక మొగ్గ దశలోనే ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఏడు ఎకరాల్లో నాటు వేయలే..

- మడిపల్లి సుధాకర్, రైతు, సిద్దెంకి



ప్రతి యేటా ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేసే వాళ్లం. ఈ యేడు ఒక ఎకరంలో మాత్రమే నాటు వేశాం. ఓ వైపు వర్షాలు లేకపోవడం, మరో వైపు దేవాదుల కాలువల ద్వారా నీరు అందకపోవడంతో విడిచిపెట్టాం. 8 ఏళ్ల నుంచి ఇలాంటి ఇబ్బందులు ఎదురవ లేదు. జిల్లాలో సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం తగు కార్యాచరణ రూపొందించాలి.. లేకుంటే చాలా మంది రైతులు నష్టపోతారు.

ప్రతి మహిళ వ్యాపారవేత్త కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య, చిత్రంలో అదనపు కలెక్టర్, డీఆర్డీవో

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆదర్శంగా నిలవాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బుధవారం జనగామ కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జిల్లా మహిళా సమాఖ్య 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. అతివలు మహిళా శక్తి పథకంతో ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పథకం దోహదపడుతుందన్నారు. మహిళలను సంఘటిత పరచి ఆర్థిక వృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకొని విభిన్న యూనిట్లను అందిస్తోందన్నారు. లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ.. పొదుపు సభ్యులందరూ రుణాలు పొందేలా అధికారులు కృషిచేయాలన్నారు. రుణాల రికవరీ పెరిగిందని, భవిష్యత్తులో రికవరీ అనే పదం ఉండరాదన్నారు. కొన్ని యూనిట్లలో మహిళలు చేపట్టిన పనుల ప్రగతిని ఆయన అభినందించారు. అనంతరం ఎంపీ కావ్య, కలెక్టర్ రిజ్వాన్‌బాషాను, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులను మహిళా సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, జడ్పీ సీఈవో సరిత, తదితరులు పాల్గొన్నారు.

చుక్క సత్తయ్య పేరు పెట్టాలని వినతి



హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్యకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: హనుమకొండలో నిర్మించిన కళాక్షేత్రానికి దివంగత ఒగ్గు కళాకారుడు డాక్టర్ చుక్క సత్తయ్య పేరు పెట్టాలని కోరుతూ తెలంగాణ కురుమ సంఘం ఆధ్వర్యంలో పలువురు జిల్లా నాయకులు హనుమకొండలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు బుధవారం వినతిపత్రం అందించినట్లు ఆ సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఒగ్గు కళాకారులు, బహుజన కులాల తరఫున వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు సంపత్, మల్లేష్, ఒగ్గు రవి, ఆంజనేయులు, బాల్దె మల్లేశం, శ్రీశైలం, లింగయ్య పాల్గొన్నారు.

రెండు పడక గదుల ఇళ్ల వద్ద ఉద్రిక్తత

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలం తొర్రూరు గ్రామంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లలో అనుమతి లేకుండా నివాసముంటున్న పలువురిని బుధవారం రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో ఖాళీ చేయించారు. దీంతో నివాసం ఉండేవారికి, అధికారులకు మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. గ్రామంలో నిర్మాణంలో ఉన్న 20 ఇళ్లు పూర్తి కాగా, గ్రామసభ నిర్వహించి ఎంపిక చేయాల్సి ఉండగా, వాయిదా పడుతూ వస్తోంది. దీంతో గ్రామానికి చెందిన పలువురు ఆ నివాసాల్లో ఉంటున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఉప తహసీల్దార్ వేణు కుమార్, ఆర్ఐ రాకేష్, రెవెన్యూ సిబ్బంది, ఎస్సై సాయి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో బయటికి పంపించారు. కొందరు పెట్రోల్ సీసాలతో అలజడి చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో వెంకన్న పాలకుర్తిలో మీడియాతో మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి కాక ముందే ఇళ్లలోకి చొరబడటం సరికాదని, త్వరలో ఎంపిక ఉంటుందని వివరించారు.

ఎవరొస్తే నాకేంటి?..



ముందు గన్‌మెన్, వెనకాల వరంగల్ ఎంపీ కావ్యతో పాటు పలువురు మహిళా సమాఖ్య సభ్యులు ఆమెను కలెక్టరేట్‌లోకి స్వాగతిస్తున్న క్రమంలో దారి మధ్యలో పడుకున్న ఓ శునకం తుపాకితో వచ్చినా.. వందమందితో వచ్చినా నాకేంటి అన్నట్లు కలెక్టరేట్‌లో దర్జాగా పడుకుందిలా..

– జనగామ అర్బన్, న్యూస్‌టుడే

అతివలకు అండగా స్త్రీనిధి రుణాలు



న్యూస్‌టుడే, కొడకండ్ల,

సంవత్సరాల కాలంగా పొదుపు నేర్పిన చైతన్యంతో మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు. సొంత కాళ్లపై నిలబడి ఆర్థిక ప్రగతికి బాటలు వేసుకొంటున్నారు. రుణాలను సకాలంలో చెల్లిస్తూ చిరువ్యాపారాలతో శాశ్వత ఉపాధిని కల్పించుకొంటూ బ్యాంకులకు నమ్మకం పెంచుకుంటున్నారు. 2011వ సంవత్సరం నుంచి కొడకండ్ల మండల సమాఖ్య పరిధిలోని 32 గ్రామైక్య సంఘాల్లోని స్వయం సహాయక సంఘాలకు చెందిన 1867 మంది మహిళలు స్త్రీనిధి ద్వార రూ.18.05 కోట్లను రుణంగా పొందారు. 100 సంఘాల్లోని ఎస్సీ మహిళలకు ప్రత్యేకంగా ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.187 లక్షలు అందించడంతో ఉపాధికి బాటలు వేసుకున్నారు. కనిష్ఠంగా రూ.25 వేల నుంచి రూ.1 లక్ష వరకు రుణాలు పొందుతున్నారు. జీవనాన్ని మెరుగుపర్చుకుంటున్న మహిళలపై ప్రత్యేక కథనం..

జెర్సీ ఆవుతో ఉపాధి



రామవరంలో శ్రీలక్ష్మి మహిళా సంఘం సభ్యురాలు ఎల్లమ్మ రూ.50 వేల స్త్రీనిధి రుణం పొంది, జెర్సీ ఆవు కొనుగోలు చేశారు. వ్యవసాయాధారిత కుటుంబ మహిళ కాగా ఆవు మేతకు కొదవ లేదు. పాలకేంద్రానికి నిత్యం 4-6 లీటర్ల క్షీరాన్ని పోస్తున్నారు. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.3-4వేల ఆదాయం పొందుతున్నట్లు తెలుపుతుంది.

యంత్రంతో ఖర్చు ఆదా..



కొడకండ్లలో మరమగ్గ పరిశ్రమ ఆధారంగా జీవిస్తున్న పలు కుటుంబాల్లో ఒకరైన రాపోలు శోభ టవల్స్ నేస్తుంది. ఇందుకు అవసరమైన దారం ఊసకు చుట్టేందుకు ఇతరులకు కిలో రూ.20 చొప్పున చెల్లించేవారు. నవ్యశ్రీ మహిళా సంఘ సభ్యురాలిగా రూ.50 వేల రుణం పొంది ఆధునిక బాబిన్ యంత్రం కొనుగోలు చేసింది. యంత్రాన్ని తానే స్వయంగా నిర్వహిస్తూ భర్తకు చేదోడుగా ఊసలకు చుట్టి నెలకు రూ.8 వేలను ఆదా చేస్తున్నట్లు వివరిస్తుంది. రుణం చెల్లింపు కూడా పూర్తయిందని, యంత్రం ఆదాయ వనరుగా మారిందని చెబుతున్నారు.

ఇంట్లోనే కిరాణ దుకాణం..



రంగాపురం గ్రామానికి చెందిన దొంగరి యాకలక్ష్మి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. ఉపాధి కూలీలుగా జీవనం సాగించడం కష్టతరంగా ఉండేది. దశాబ్ద కాలంగా ఇందిర పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉండటంతో రూ.50 వేలు మంజూరయ్యాయి. 2016లో ఇంటి వద్దనే నిత్యావసర వస్తువులు, కిరాణా సామగ్రితో చిన్న దుకాణం ప్రారంభించింది. ప్రస్తుతం రోజుకు రూ.300-400 వరకు అమ్మకాలు జరుగుతున్నట్లు వివరించింది. రుణం చెల్లింపులు పూర్తయ్యాయి. ఇంటి వద్దే ఉంటూ నెలకు రూ.3-4వేలు పొందుతున్నట్లు హర్షం వ్యక్తం చేసింది.

వృత్తికి ఊతమైంది..



కొడకండ్లకు చెందిన ఎల్లంల కొమురమ్మ కుటుంబం గొర్రెల పెంపకం వృత్తిగా జీవిస్తున్నారు. ఉన్న కొద్దిపాటి జీవాలను మేపడం, అమ్మడం క్రమంగా తగ్గుతూ వచ్చింది. స్త్రీనిధి రుణాల్లో భాగంగా కృష్ణసాయి సంఘం సభ్యురాలైన ఆమె రూ.50 వేలతో ఏడు గొర్రెలు, ఒక పోతును తీసుకుంది. ఆరు మాసాల్లోనే వాటి సంఖ్య పెరిగి రెట్టింపు ఆదాయమైందని సంబురపడుతున్నారు. మరిన్ని తీసుకుంటానని వివరిస్తున్నారు.

సద్వినియోగం చేసుకుంటున్నారు..

- సత్యనారాయణ, ఏపీఎం, కొడకండ్ల మండల సమాఖ్య

మహిళా సంఘాలకు లభించే బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి. కొంత మంది వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారు.. చిరు వ్యాపారాలు, ఆర్థిక వనరులా ఉండేలా ఉపయోగించుకోవాలి. చెల్లింపు కూడా 98 శాతం ఉంది. స్త్రీనిధి పట్ల సంఘాల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ వడ్డీ భారాన్ని తగ్గించాలని వివరిస్తున్నారు.

పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ తొలగింపు నిలుపుదల

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమాలకు పాల్పడ్డారనే అభియోగంపై రఘునాథపల్లి మండలం కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) వైస్ ఛైర్మన్ మూడ్ ధర్మపై జిల్లా సహకార అధికారి వై.రాజేందర్ రెడ్డి ఇటీవల అనర్హత వేటు వేసిన నేపథ్యంలో ఆ ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ హైకోర్టు మంగళవారం ఆదేశాలను జారీ చేసింది. తనపై మోపిన అభియోగంపై విచారణ పూర్తి కాకుండానే అనర్హత వేటు వేయడం సరి కాదని ధర్మ హైకోర్టును ఆశ్రయించగా, ఊరట లభించింది. తిరిగి పదవిలో కొనసాగించాలంటూ బుధవారం ఆ పత్రాన్ని జిల్లా సహకార అధికారికి అందజేసినట్లు ధర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ అసమ్మతి నాయకులపై కేసు నమోదు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆయన వ్యతిరేక వర్గం నాయకులకు మధ్య జరుగుతున్న గొడవలో తాజాగా కొమ్మూరి వ్యతిరేక వర్గంగా ఉన్న ముగ్గురు నాయకులపై జనగామ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తనను ఇసుక లారీతో ఢీకొట్టించడానికి రాగుల శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తికి ప్రతాప్‌రెడ్డి రూ.25లక్షల సుపారీ ఇచ్చారని వ్యతిరేక వర్గం నాయకులైన కంచె రాములు.. ఎర్రమల్ల సుధాకర్, వేమళ్ల సత్యనారాయణరెడ్డిలతో కలిసి డీసీపీకి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. అయితే రాగుల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం రాత్రి జనగామ పోలీస్ స్టేషన్‌లో సదరు ముగ్గురు నాయకులపై ఫిర్యాదు చేశారు. తాను ఎలాంటి సుపారీ తీసుకోలేదని, తనను ఆర్అండ్‌బీ అతిథి గృహానికి పిలిచి కంచె రాములు బెదిరించారని పేర్కొన్నారు. తనకు కొమ్మూరితో ఎలాంటి విభేదాలు లేవని, రాములు, సుధాకర్, సత్యనారాయణరెడ్డిల నుంచి తనకు ప్రాణహాని ఉందని వివరించారు. శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా హిందీ దినోత్సవం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: హిందీ దివాస్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం హిందీ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.నర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య ప్రదీప్‌కుమార్ హాజరై, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే హిందీ తప్పనిసరి అన్నారు. అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మౌంట్ గోరీచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్


జాతీయ పతాకంతో యశ్వంత్

మరిపెడ, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ గోరీచెన్ పర్వతాన్ని అధిరోహించి మరో ఘనత సాధించారు. అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన యశ్వంత్ పట్టుదల, కృషి, ఆసక్తితో ప్రపంచంలోని శిఖరాలను అధిరోహిస్తున్నారు. సెప్టెంబర్ 4న ప్రారంభించిన యాత్ర 6488 మీటర్ల ఎత్తైన శిఖరాన్ని 18 రోజుల్లో అధిరోహించి కిందకు దిగినట్లు యశ్వంత్ పేర్కొన్నారు. ఎవరెస్ట్ అధిరోహించాలనే సంకల్పంతో ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నట్లు పేర్కొన్నారు. అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య యశ్వంత్‌కు అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సాహస అభిమానులు యశ్వంత్‌కు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీందర్, పీఆర్‌టీయూ నాయకులు


వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల సాధన కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని జడ్పీ సమావేశ మందిరంలో సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘం కృషితోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు జరిగాయని చెప్పారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ ప్రభుత్వంతో పోరాడి జరుపుతామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ.. టీచర్ల సమస్యలు, పాత బకాయిల చెల్లింపులపై సీఎంను కలుస్తామని అన్నారు. అనంతరం వరంగల్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అబ్దుల్ గఫార్, అసోసియేట్ అధ్యక్షులుగా కె.రఘు, ఎ.మహేందర్, ఉపాధ్యక్షులుగా పి.మల్లయ్య, సి.సుధాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా పి.అర్పితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, మాజీ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్, ప్రతిక సంపాదకులు ఇన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

లక్ష్యం వైపు దూసుకెళ్తున్నారు!


మహ్మద్ కైఫ్


సబ్బావత్ దత్తు


రవితేజ


గణేష్

ప్రతిభ గల పేద క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తే.. అద్భుతంగా రాణిస్తారనడానికి ఉదాహరణ ఇది.. సరైన నైపుణ్య శిక్షణ అందిస్తే చక్కటి ఫలితాలు వస్తాయనడానికి తార్కాణమిది.. 'ఈనాడు' సంస్థ తీసుకొచ్చిన 'లక్ష్య' కార్యక్రమం మారుమూల క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొస్తోంది... వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన జీవాంజీ దీప్తి 'లక్ష్య' ప్రోత్సాహంతో పారిస్ పారాలింపిక్స్‌లో ఏకంగా కాంస్య పతకం కొల్లగొట్టింది. ఆమె స్ఫూర్తిగా హనుమకొండ కేంద్రంగా శిక్షణ తీసుకుంటున్న అథ్లెట్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలతో దుమ్ములేపుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలతో అదరగొట్టారు. ఈ నేపథ్యంలో వారిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం

చిరుత వేగంతో..

హుజురాబాద్‌కు చెందిన స్ప్రింటర్ మహ్మద్ కైఫ్ పరుగులో చిరుత వేగంతో పోటీపడతారు. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి ఉండటంతో అథ్లెటిక్స్ ఎంచుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 200 మీటర్ల పరుగులో స్వర్ణం, 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలతో ప్రతిభ కనబరిచారు. నాలుగు జాతీయ, ఆరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న కైఫ్ స్ప్రింట్స్‌లో రికార్డు టైమింగ్ సృష్టిస్తానని చెబుతున్నారు.

రెండు విభాగాల్లో..

మంచిర్యాలకు చెందిన రవితేజ 3000 మీటర్ల(ఫ్లాట్ రన్), 3000 మీటర్ల స్టిపుల్ చేస్‌లో అత్యంత ప్రతిభతో రాణించాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో రెండు విభాగాల్లో కాంస్య పతకాలు కొల్లగొట్టాడు. జాతీయ స్థాయిలో నాలుగు, రాష్ట్ర స్థాయిలో 9 టోర్నీల్లో పాల్గొన్నాడు. అండర్-20 3000 మీటర్ల స్టిపుల్ చేస్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాలని లక్ష్యంగా సాధన కొనసాగిస్తున్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో రెండో ఏడాది చదువుతున్నారు.

భారత జట్టులో చోటు కోసం..

నల్గొండకు చెందిన దత్తు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నారు. లాంగ్‌జంప్, హెప్టాథ్లాన్‌లో తనదైన ప్రదర్శనతో పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు కైవసం చేసుకున్నారు. నిరుపేద రైతు కుటుంబానికి చెందిన దత్తుకు 'లక్ష్య' కేంద్రం అండగా ఉంటూ ఉచితంగా నైపుణ్య శిక్షణ అందిస్తోంది. ఇప్పటివరకు ఐదు జాతీయ స్థాయి, 14 రాష్ట్రా స్థాయి టోర్నీల్లో పాల్గొన్నారు. భారత అథ్లెటిక్స్ బృందంలో చోటు సంపాదిస్తానని అంటున్నారు.

రికార్డు టైమింగ్ నమోదు

హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో గణేష్ రికార్డు టైమింగ్ నమోదు చేశారు. 100 మీటర్ల పరుగును 10.83 సెకండ్లలో పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టైమింగ్‌గా కోచ్ నాగరాజు తెలిపారు. నల్గొండకు చెందిన రవితేజ హనుమకొండలోని కేడీసీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నారు. రెండేళ్ల క్రితమే రవితేజ 'లక్ష్య'లో చేరారు. నైపుణ్య శిక్షణ అందడంతో పరుగుకు మరింత పదును పెంచారు. మెరుగైన ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలోను రికార్డు టైమింగ్ నమోదు చేస్తానని తెలిపారు.

హనుమకొండ జేఎన్ స్టేడియం కేంద్రం

2019లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కేంద్రంగా ఈనాడు 'లక్ష్య' అథ్లెటిక్స్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. వరంగల్‌కు చెందిన భారత అథ్లెటిక్స్ జట్టు చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ సూచనతో జాతీయ స్థాయి అథ్లెట్ నాగరాజును కోచ్‌గా ఎంపిక చేశారు. కొద్ది మందితో ప్రారంభమైన శిక్షణ అంచెలంచెలుగా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటే వరకు చేరారు. ప్రస్తుతం 18 బాలురు, ఒక బాలిక తర్ఫీదు పొందుతున్నారు. వారిలో 15 మంది జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. దత్తు, గణేష్ జాతీయ స్థాయిలో ఏకంగా పతకాలు కొల్లగొట్టారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలు

దక్షిణ భారత పోటీలకు..

ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో వరంగల్ లక్ష్య అథ్లెట్లు ఏకంగా పది పతకాలు సొంతం చేసుకున్నారు. దత్తు, కైఫ్, గణేష్, శ్రీధర్, రాఘవ, రవితేజ, తరుణ్‌కుమార్ తమ విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో పతకాలు సాధించారు. కైఫ్, గణేష్, శ్రీధర్, రవితేజ, దత్తులు గుంటూరులో అక్టోబర్ 19, 20న జరిగే దక్షిణ భారత అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో దత్తు, కైఫ్, రవితేజ రెండేసి పతకాలతో సత్తాచాటారు.


హనుమకొండ జేఎన్ స్టేడియంలో శిక్షణలో ఉన్న అథ్లెట్లతో లక్ష్య మెంటర్ నాగపురి రమేష్ (పాత చిత్రం)

ఆర్మీ ఉద్యోగాలకు ఎంపిక


లక్ష్య శిక్షణ శిబిరానికి చెందిన అథ్లెట్లు 2022, 2023 సంవత్సరాల్లో ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో నిరోష్, ఆదిత్య కృష్ణ, రోహిత్, శ్రీను, ప్రవీణ్, అభినవ్, రఘునాథ్, సింగ్, నగేష్ శ్రావణ్‌లు ఉన్నారు. ప్రస్తుతం దేశంలోని వివిధ సైనిక శిబిరాల్లో శిక్షణలో ఉన్నారు.


జనగామ కలెక్టరేట్‌లో ప్రారంభించి భోజనం చేస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ రిజ్వాన్‌బాషా, తదితరులు

మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో జనగామ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పాలనాధికారి రిజ్వాన్ బాషాతో కలిసి వరంగల్ ఎంపీ కడియం కావ్య బుధవారం ప్రారంభించి, నిర్వహణ పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలిసి భోజనం చేశారు. కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మంచి నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని నిర్వాహకులకు ఎంపీ సూచించారు. అనంతరం బిల్లు చెల్లిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా కలెక్టర్ పేరిట నకిలీ ఖాతా



ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్ బుక్ ఖాతా తెరిచి పలువురికి మెసేజ్‌లు పంపిస్తూ డబ్బులు అడుగుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన కలెక్టర్ అప్రమత్తమై మోసపూరిత మెసేజ్‌లను నమ్మొద్దని, వెంటనే దానిని తొలగించాలని పేర్కొంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ పేరుతో సమావేశంలో ఉన్నానని అత్యవసరంగా డబ్బులు కావాలని 998886747021 ఉజ్బెకిస్తాన్ నంబర్ నుంచి పలువురికి ఈ సందేశం పంపించి సైబర్ నేరగాళ్లు డబ్బులు ఫోన్ పే చేసి స్క్రీన్ షాట్ షేర్ చేయాలని కోరారు. దీంతో కలెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వొద్దని సూచించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణ ఎస్సైలకు ఠాణాల కేటాయింపు

వరంగల్‌క్రైం : పోలీసు శాఖలో ఎంపికై శిక్షణకు కమిషనరేట్‌కు వచ్చిన ఎస్సైలకు ఠాణాలు కేటాయించారు. రెండు ఠాణాల్లో 15 రోజుల చొప్పున విధులు నిర్వర్తించాలి. వివిధ అంశాలపై సీనియర్ అధికారులు అవగాహన కల్పిస్తారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 9 వరకు, అక్టోబర్ 10 నుంచి 24 వరకు రెండు విడతల్లో శిక్షణ పొందుతారు.

ప్రతిభ చాటేందుకు.. యువజనోత్సవం

స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల ఆధ్వర్యంలో ఏటా యువజనోత్సవం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా యువత ప్రతిభ చాటేందుకు అవకాశం కల్పిస్తోంది. రాష్ట్ర సంచాలకుడు, యువజన సర్వీసుల శాఖల ఆదేశాల మేరకు పాలనాధికారి అధ్యక్షతన జిల్లా యువజన, క్రీడల ఆధ్వర్యంలో ఈ నెల 28న యువజనోత్సవాలను నిర్వహించనున్నారు. జానపద నృత్యాలు, జానపద గేయాలు విభాగంలో వ్యక్తిగత, బృంద పోటీలు ఉంటాయి. కవిత్వం, వ్యాసరచన, పోస్టర్ రూపకల్పన, వక్తృత్వ పోటీలు ఉంటాయి. సైన్స్ మేళాను యువజనోత్సవాల్లో మొదటిసారి ప్రవేశపెట్టారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ఈ పోటీలు ప్రవేశపెట్టారు. యువత సొంతంగా తయారు చేసిన ప్రాజెక్టులు, నమూనాలు ప్రదర్శించవచ్చు. యువకృతి విభాగంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన హస్తకళలను అర్థం చేసుకోడానికి యువజన క్రీడల శాఖ అవకాశం కల్పిస్తోంది. దీని కోసం హస్త కళలు, వస్త్రాలు, వ్యసాయ ఉత్పత్తులు, తదితర అంశాలపై గరిష్ఠంగా ఇద్దరు వ్యక్తులు ముఖాముఖిలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. యువజనోత్సవాలను యువతీ యువకులకు మూడు దశల్లో పోటీలు నిర్వహిస్తారు. మొదటి దశ జిల్లా స్థాయిలో ఈ నెల 28న, రెండో దశ హైదరాబాద్‌లో, మూడో దశ జనవరి 12-16 వరకు కర్ణాటకలో జాతీయ స్థాయి పోటీలు ఉంటాయి. 15 నుంచి 29 ఏళ్ల మధ్యనున్న యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా యువజన, క్రీడల అధికారి తుల రవి కోరారు.


జానపద నృత్యం చేస్తున్న బృందం (పాత చిత్రం)

–న్యూస్‌టుడే, ములుగు టౌన్

నైపుణ్య ప్రదర్శనకు.. కళా ఉత్సవ్

విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా వివిధ దశల్లో ప్రతిభ చాటేందుకు ఎన్‌సీఈఆర్టీ, తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ సంయుక్తంగా 'కళా ఉత్సవ్' పేరుతో పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పోటీల నిర్వహణకు విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తొమ్మిది, పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థులు ఏదైనా కళను ప్రదర్శించవచ్చు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలి. మండల, జిల్లా స్థాయి పోటీలు జిల్లా విద్యాధికారుల సూచనల మేరకు ఈ నెలాఖరు నాటికి నిర్వహిస్తారు. అక్టోబరులో రాష్ట్ర స్థాయి, నవంబరులో జాతీయ స్థాయిలో పోటీలు జరగనున్నాయి. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన కళాకారులకు నగదు బహుమతులు, పథకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. స్వర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్, దృశ్యకళ, సంప్రదాయక కథ చెప్పడం వంటి అంశాలపై ప్రధానంగా పోటీలు ఉంటాయి. ఉప అంశాలైన జానపద, క్లాసికల్ నృత్యాలు, సంగీతం, సంప్రదాయ చిత్రాలు, హిందుస్థానీ, కర్ణాటక, జానపదం, చిత్రలేఖనం, శిల్పకళ, కథలు చెప్పడం, నాటకంలో కళాకారులు తమ ప్రతిభ చూపవచ్చు. 'వివిధ కళల్లో విద్యార్థులు ప్రతిభ చాటేందుకు 'కళా ఉత్సవ్' ఓ మంచి వేదిక.. జిల్లా విద్యాధికారి సూచనల మేరకు ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని అకాడమిక్ క్వాలిటీ సమన్వయకర్త కె.లక్ష్మణ్ చెప్పారు.


నృత్యం చేస్తున్న విద్యార్థిని(పాతచిత్రం)

– న్యూస్‌టుడే, భూపాలపల్లి, మానుకోట

పనులు వేగిరం.. దక్కిన ఫలితం

ఎన్‌హెచ్‌సీ పోటీల్లో ఓరుగల్లు సత్తా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చారిత్రక ఓరుగల్లు మహా నగరానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. మూడేళ్లుగా నిర్వహిస్తున్న నైబర్ హుడ్ ఛాలెంజ్(ఎన్‌హెచ్‌సీ) పోటీల్లో గ్రేటర్ వరంగల్ సత్తా చాటింది. బెంగళూరు, ఇండోర్, జబల్‌పూర్, కొచ్చితో పాటు వరంగల్ నగరానికి నైబర్ హుడ్ ఛాలెంజ్ పోటీల్లో 'ఎక్సలెన్స్ సర్టిఫికెట్' దక్కింది. బుధవారం దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్మార్ట్‌సిటీ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా బల్దియా ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఏఈ కార్తీక్‌రెడ్డి ఎక్సలెన్స్ ధ్రువపత్రం అందుకున్నారు.


దిల్లీలో స్మార్ట్‌సిటీ ఎండీ రాహుల్ కపూర్ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న గ్రేటర్ వరంగల్ ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, చిత్రంలో ఏఈ కార్తీక్‌రెడ్డి

ఎందుకు వచ్చిందంటే..!

దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 100 స్మార్ట్‌సిటీ నగరాలకు మూడేళ్ల క్రితం మొదటి దశలో నర్చరింగ్ నైబర్ హుడ్ ఛాలెంజ్ పేరుతో నిధులు కేటాయించారు. స్మార్ట్‌సిటీ మిషన్ జారీ చేసిన నిర్ణీత సమయంలో అధికారులు వరంగల్ దేశాయిపేట ఎంహెచ్‌నగర్‌లో 56 గంటల్లో చిట్టి పార్కు ఏర్పాటు చేశారు. ఇదే విధంగా క్రిస్టియన్ కాలనీ, కరీమాబాద్ గుండుబావి, హనుమకొండ శ్రీనగర్ కాలనీలో పార్కులు సిద్ధం చేశారు. హనుమకొండ అంబేడ్కర్ కూడలిలో బుద్ధ ప్లాజాను నిర్ణీత సమయంలో పూర్తి చేశారు. ఈ వివరాలన్నీ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు పంపించారు. ఈ నేపథ్యంలో గుర్తింపు దక్కింది.

వరంగల్‌కు గర్వకారణం

- గుండు సుధారాణి, మేయర్

'నైబర్ హుడ్ ఛాలెంజ్' పోటీల్లో వరంగల్ నగరానికి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ దక్కడం గర్వంగా ఉంది. ఈ స్ఫూర్తితో నగర సుందరీకరణ కొనసాగిస్తాం. రెండో దశ పోటీ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇవ్వనుంది. వాటితో మరిన్ని పార్కులు అభివృద్ధి చేస్తాం.


పార్కు ముఖ ద్వారం పరిస్థితి ఇది


నిలిచిన వర్షం నీరు

సరిగమ.. నిర్వహణ మమ!

ఫోకస్


కూలిన స్తంభాలు

ఒకప్పుడు ఆ పార్కులోకి వెళ్తే సప్త స్వరాలు వింటున్న అనుభూతి కలిగేది. . శిల్ప సౌందర్యం, పచ్చని పరిసరాలు ఆహ్లాదంగా కనిపించేవి.. నేడు మాత్రం విరిగిన ముఖద్వారం తాలూకు శిల్పాలు, అక్కడక్కడా అందమైన శిల్పాలకు పెట్టిన లైట్లు దొంగలపాలయ్యాయి. నిర్వహణ లేక ఆ పార్కు ఇలా కనిపిస్తోంది. లక్షలు వెచ్చించి ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. హనుమకొండలోని పద్మాక్షి రోడ్‌లోని సరిగమ పార్కు దుస్థితి ఇది. – ఈనాడు, హనుమకొండ


దొంగల పాలైన శిల్పాల ముందు లైట్లు

రాష్ట్రస్థాయి జూడో పోటీలు షురూ!

వరంగల్ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి జూడో పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) రాష్ట్రస్థాయి పోటీలు పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో జరిగాయి. ముఖ్య అతిథిగా ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఎస్‌జీఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రునాయక్ మాట్లాడుతూ.. సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించినట్లు వివరించారు. ఈ నెల 27 వరకు పోటీలు జరుగుతాయన్నారు. వివిధ జిల్లాల కోచ్‌లు, ప్రభుత్వ పీఈటీలు పాల్గొన్నారు.

దివ్యాంగ లక్షణాల గుర్తింపునకు ప్రశస్త్

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: పిల్లలకు దివ్యాంగ లక్షణాలు బాల్యంలోనే కనిపించినా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంతగా శ్రద్ధ వహించకపోవడంతో వయస్సు పెరుగుతున్న కొద్దీ అధికమవుతోంది. ఇందుకు నివారణగా వీరిని ఉపాధ్యాయులు ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే మెరుగైన జీవనం గడపగలరని జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి(ఎన్సీఈఆర్టీ) సంకల్పించింది. ఇందుకోసం దేశ వ్యాప్తంగా మూడంచెల నిర్ధారణ కార్యక్రమాలకు నిర్ణయించింది. ఇందులో భాగంగా రిసోర్సు పర్సన్లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి..

● విద్యార్థులు సచేతనంగా ఉన్న సమయంలో ఉపాధ్యాయుల సమక్షంలోనే ఎక్కువగా ఉంటారు. ఈ క్రమంలో వారిని పాఠశాలలో సునిశితంగా గమనించే వీలుంటుంది. వారిలో దివ్యాంగ లక్షణాలు ఉంటే గుర్తించడానికి 'ప్రశస్త్' యాప్‌ను రూపొందించింది. ప్రధానోపాధ్యాయుడి మెయిల్ చిరునామా ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది. మొత్తం 21 రకాల వైకల్యాలను గుర్తించిన విద్యాశాఖ తొలుత విద్యార్థులను ఉపాధ్యాయుడు కనీసం రెండు వారాల పాటు గమనించి విద్యార్థి వివరాలను నమోదు చేయాలి. రెండో దశలో శిక్షణ పొందిన నిపుణులు గమనించినట్లు నమోదు, మూడో దశలో ఆ లక్షణాలున్న విద్యార్థి తల్లి లేదా తండ్రిని విడిగా పిలిపించి గుర్తించిన రుగ్మతలను వివరించి, అనుమతిస్తే పరీక్షకు పంపిస్తారు. చిన్నప్పుడే చికిత్స అందించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని కౌన్సిలింగ్, నిపుణులతో కూడా మాట్లాడిస్తారు. వారి అనుమతితో విద్యార్థిని ఉన్నత స్థాయి పరీక్షలకు పంపించి, ధ్రువపత్రం అందజేస్తారు. అక్కడి నుంచి సదరు విద్యార్థి ప్రత్యేక ప్రతిభావంతుడిగా గుర్తింపబడతాడు. మొదట తనకు దివ్యాంగ లక్షణాలు పరీక్ష చేస్తున్నామనే భావన కలగకుండా రిసోర్సు పర్సన్లు జాగ్రత్తలు తీసుకుంటారు. మొదటి దశ నివేదికలు అక్టోబర్ 26వ తేదీ వరకు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.



ప్రశస్త్ యాప్ అంతర్గాల పుట

వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించండి


వారోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, చిత్రంలో డీడబ్ల్యూవో జయంతి, వయోవృద్ధులు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: వయోవృద్ధులకు ఏ సమస్య వచ్చినా అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వయోవృద్ధుల జిల్లా కమిటీ సభ్యులు, వయోవృద్ధుల అసోసియేషన్స్, అనాథ వృద్ధాశ్రమాల నిర్వాహకులతో కలెక్టర్ సమావేశమయ్యారు. వారితో కలిసి వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ.. వయోవృద్ధుల సంరక్షణ, రక్షణ చట్టం 2007 మీద ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 26 నుంచి 30 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అక్టోబర్ 1న వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో జయంతితో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్:80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

జనగామ, న్యూస్‌టుడే: పట్టణంలోని 13వ వార్డులో మూడు రోజులుగా ఇంటింటి చెత్త సేకరణ జరగడం లేదు. పుర అధికారులు చర్యలు తీసుకోవాలి. **- కాలనీవాసులు**

సమాధానం: చెత్త సేకరణ ఆటోను కుక్కల నియంత్రణ ప్రక్రియకు తరలించడంతో ఇబ్బంది ఏర్పడింది. చెత్త తరలింపునకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాము. **- గోపయ్య, పారిశుద్ధ్య అధికారి**

దేవరుప్పుల: దేవరుప్పుల రెండు పడక గదుల సమీపంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికులు**

సమాధానం: సిబ్బందితో సమస్యను పరిష్కరిస్తాం **- వెంకన్న, పంచాయతీ కార్యదర్శి**

దేవరుప్పుల: దేవరుప్పుల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపుల ముళ్లకంపలు ఏపుగా పెరిగాయి. **- స్థానికులు**

సమాధానం: వెంటనే తొలగింపజేయిస్తాం. **-వెంకన్న పంచాయతీ కార్యదర్శి**

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రం శివారులోని బైపాస్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. **- రాజు, పాలకుర్తి**

సమాధానం: సిబ్బందితో శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటా. **- జయంతి, పాలకుర్తి ప్రత్యేకాధికారిణి.**

పిచ్చిమొక్కల తొలగింపు

స్పందనకు వందనం

తరిగొప్పుల, న్యూస్‌టుడే: మండలంలోని బొంతగట్టునాగారం నాలుగో వార్డులో మురుగు కాల్వ పక్కన పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి దోమలకు ఆవాసంగా మారాయని కాలనీ వాసులు మేమున్నాం.. మీకుతోడుగాకు తెలియజేశారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి రాజు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి సిబ్బందిని పురమాయించి పిచ్చి మొక్కలు తొలగించారు.

జిల్లా స్థాయికి క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో రాము

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల(బాలురు)లో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరఫున 14, 17 సంవత్సరాల బాలుర విభాగంలో క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై ఆసక్తి పెంచుకుని రాణించాలన్నారు. మండల విద్యాధికారి రాజేందర్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు, క్రీడల కన్వీనర్ అజ్మీర కిషన్, వైస్ ప్రిన్సిపల్ నర్సింహులుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై థియేటర్లలో ప్రచారం


లోక్ అదాలత్ ప్రకటనలను వీక్షిస్తున్న న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 28న జిల్లా కోర్టులో నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను వినియోగించుకునేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడానికి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో జనగామ పట్టణంలోని దేవి థియేటర్‌లో లోక్ అదాలత్ సమాచారం, ఉపయోగాలపై బుధవారం ప్రకటనలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ, సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారధి, సీఐ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రకటనలు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. రాజీపడే స్థాయి కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

'కొమ్మూరిపై ఆరోపణలను సహించం'



జనగామ, న్యూస్‌టుడే: జనగామ డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై అసంబద్ధ ఆరోపణలు, విమర్శలు చేస్తే సహించబోమని పట్టణంలోని 30 వార్డుల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రకటించారు. గత 15 ఏళ్లుగా పార్టీ అభ్యర్థుల ఓటమికి, గ్రూపు తగాదాలకు కారణమవుతున్న నాయకులపై చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. బుధవారం జనగామలో జరిగిన వార్డు అధ్యక్షుల సమావేశంలో మాట్లాడారు. సీజనల్ నాయకుల మాదిరిగా వ్యవహరిస్తున్న వారిపై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్గ రాజకీయాలు మాని, కొమ్మూరి నాయకత్వంలో పనిచేయాలని తెలిపారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ మేలు


నర్మెట్టలో వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టరు అనిల్ కుమార్, అధికారులు

తరిగొప్పుల, నర్మెట్ట, న్యూస్‌టుడే: వానాకాలం సాగులో వరి, పత్తి పంటపై తెగుళ్ల దాడి ఉద్ధృతంగా ఉంటుందని ఏరువాక కేంద్రం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు బి.అనిల్ కుమార్ అన్నారు. బుధవారం తరిగొప్పులలో పలువురు రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి పంటను వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పుల కారణంగా పంట చేన్లను చీడపీడలు అధికంగా ఆశించడం వల్ల దిగుబడి తగ్గుతుందన్నారు. వీటిని సకాలంలో నివారించకపోతే తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదముందని, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సంతోషి, ఏడీఏ బీనా ఏఈవోలు కమల, రేష్మ, ప్రవళిక రైతులు పాల్గొన్నారు. అలాగే నర్మెట్ట మండలంలోని పలువురు రైతులకు పంట సస్యరక్షణ చర్యలను వివరించారు. మండల వ్యవసాయాధికారిణి డి.సంతోషి, ఏఈవోలు కమల, జగదీష్, రైతులు హనుమారెడ్డి, లింగారెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

పరిష్కారం లేదా?..



కొంచెం శ్రద్ధ చూపితే, కాస్త ఖర్చు పెడితే రాకపోకలకు దారిగా ఉపయోగపడే స్థలం అది. కానీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారస్తులు, పట్టింపు లేని పుర బాధ్యుల కారణంగా బాట, పక్కనే ఖాళీ స్థలం డంపుయార్డును తలపిస్తోంది. స్థానిక రైల్వే పాత గేటు సమీపంలోని కూడలి విషయంలో మున్సిపల్ అధికారులు చేతులెత్తేశారు. కనీసం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం పూర్తయ్యే వరకైనా ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. **- జనగామ, న్యూస్‌టుడే**

తప్పదు తనయా.. పని కూడా ముఖ్యమే!



జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ కలెక్టరేటులో బుధవారం చాకలి ఐలమ్మ జిల్లా మహిళా సమాఖ్య వార్షికోత్సవ సమావేశం జరిగింది. ఇందులో పాల్గొనేందుకు మహిళా సమాఖ్య సభ్యురాలు ఒకరు తన కొడుకుతో పాటు వచ్చింది. ముఖ్య అతిథి ఎంపీ కావ్య పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభించే క్రమంలో ఈ చిన్నోడు నిద్రలోకి జారుకున్నాడు. తల్లికేమో మీటింగ్ తప్పనిసరి, తనయుడికేమో కునుకు తప్పదాయె. దీంతో ఆ మహిళ తన కొడుకును ఇలా నేలపై పడుకోబెట్టి తాను అతిథుల ప్రసంగాన్ని ఆలకించింది.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?..

నర్మెట్ట-వెల్దండకు వెళ్లే రహదారి వెల్దండ నాగుల చెరువు మత్తడి వద్ద కల్వర్టు ప్రమాదకరంగా మారింది. గత సంవత్సరం కురిసిన వర్షాలకు వర్షం నీరు, చెరువు మత్తడి నీరు ఉధృతంగా ప్రవహించడంతో కోతకు గురైంది. అధికారులు తాత్కాలిక మరమ్మత్తుగా మట్టిని పోసినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని మరమ్మతు చేయించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. **– నర్మెట్ట, న్యూస్‌టుడే**



భాజపా సభ్యత్వ నమోదు



జనగామ అర్బన్, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నెహ్రూపార్కు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు పార్టీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేశ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో ప్రపంచంలోనే ఎక్కువ సభ్యత్వాలు ఉన్న పార్టీగా భాజపా గుర్తింపు పొందిందన్నారు. నాయకులు డా.శశిధర్‌గుప్తా, సాయికుమార్, అనీల్, సాయికిరణ్, ఉపేందర్ పాల్గొన్నారు.

రైతులకు 'డీసీసీబీ' విస్తృత సేవలు

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: డీసీసీబీ చేర్యాల బ్రాంచ్ ద్వారా బచ్చన్నపేట మండలంలోని రైతులకు విస్తృత సేవలు అందజేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ కాపర్తి సంపత్ తెలిపారు. బుధవారం బచ్చన్నపేట పీఏసీఎస్‌ను ఆయన సందర్శించి, మాట్లాడారు. మండల పీఏసీఎస్ పరిధిలో 1450 ఖాతాదారులున్నారని, క్రాప్‌లోను, ఉన్నత చదువులు, గొర్ల యూనిట్లు, డైరీఫాంలు, అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ రుణాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. చేర్యాల, బచ్చన్నపేట మండల పరిధిలో 420 మందికి మార్టిగేజ్ చేసి, రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీఈవో బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్లను పూర్తి చేయండి

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పాలకుర్తి మండలం గూడూరులో నిర్వహించిన మహాసభకు హాజరై మాట్లాడారు. గత సర్కార్ పనులపై నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా పూర్తి చేయించాలన్నారు. రిజర్వాయర్లు పూర్తయితే వేల ఎకరాలకు సాగు నీరందుతుందన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేశ్, మండల కార్యదర్శి సారయ్య, పనికర రాజు, నాగయ్య, సోమన్న పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ జయంతి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని నేడు(గురువారం) అధికారికంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని ప్రజాప్రతినిధులు, రజక సంఘం నాయకులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

వైద్య శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా వైద్యారోగ్య శాఖలో పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసి ప్రొవిజనల్ జాబితాను అధికారులు ప్రకటించారు. రెండు రోజుల్లో మెరిట్ జాబితా ప్రకటించి, అభ్యర్థులను ఎంపిక చేసే దశలో స్టాఫ్ నర్సు ఉద్యోగానికి దరఖాస్తు చేసిన ఓ యువతికి సైబర్ నేరస్థుడు ఫోన్ చేసి ఉద్యోగం ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసిన సంఘటన బుధవారం వెలుగుచూసింది. సదరు యువతికి మంగళవారం అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.2లక్షలు అడిగాడు. ఈ క్రమంలో నమ్మిన యువతి ముందుగా రూ.20వేలు ఫోన్‌పే ద్వారా పంపించారు. అనుమానం వచ్చిన యువతి బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చి తెలుసుకోగా మోసపోయినట్లు గ్రహించింది. అపరిచిత వ్యక్తులను నమ్మకూడదని ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రవీందర్‌గౌడ్ ఆమెకు తెలిపి, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇదే నోటిఫికేషన్‌కు సంబంధించి రెండు నెలల క్రితం కూడా పలువురు అభ్యర్థుల నుంచి సైబర్ నేరస్థుడు డబ్బులు వసూలు చేసిన విషయం విదితమే.

న్యాయం చేయాలని బాధిత రైతుల విన్నపం



రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని నిడిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)లో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో బుధవారం నిడిగొండ, పడమటి గుంటూరుగూడెం గ్రామాల రైతులతో సంబంధిత అధికారులు విచారణ జరిపారు. సహకార శాఖ సర్కిల్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.దివ్య పాల్గొని రైతులు తెలిపిన వివరాలను రికార్డులతో పోల్చి పరిశీలించారు. తీసుకున్న రుణాలు, చెల్లింపుల రశీదులు కొందరు రైతులు విచారణాధికారికి అందజేయగా తాము చెల్లించినా రశీదులు ఇవ్వలేదని మరికొందరు వాపోయారు. క్షేత్ర స్థాయి అధికారుల అక్రమాలు, అలసత్వం మూలంగా తాము నష్టపోయినందున న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మాసాన్‌పల్లి శాంతోజీ, ఎలపాటి కరుణాకర్ రెడ్డి, మైలారపు ఆంజనేయులు, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో వర్షం



బచ్చన్నపేట, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. మధ్యాహ్నం ప్రారంభమైన ముసురు సాయంత్రం వరకు అధికమైంది. దీంతో మండలంలోని పలు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి.

సీహెచ్‌సీలో 'ఫార్మాసిస్ట్ డే'



బచ్చన్నపేట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఫార్మాసిస్ట్‌డేను బుధవారం బచ్చన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి పంచుకున్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ఫార్మాసిస్ట్‌లు పోషించే పాత్ర ప్రాధాన్యత కలిగిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు మానస, సిద్ధిసుదర్శన్, సృజన, అనాంబిక, ఫార్మసిస్ట్‌లు బోడ్డు శ్రీనివాస్, నగేశ్, లలిత పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని సీఐ వేణు అన్నారు. ఆయయ బుధవారం రాత్రి సముద్రాల, ఇప్పగూడెం, పాముసూర్ గ్రామాలను సందర్శించారు. పాముసూర్‌లో గ్రామస్థులతో మాట్లాడారు. శాంతి భద్రతలకు సహకరించాలన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి


చిల్పూర్‌లో మాట్లాడుతున్న డీపీవో స్వరూప

చిల్పూర్, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా మంచి నీటి సహాయకులు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి స్వరూప అన్నారు. చిన్న పెండ్యాల పంచాయతీ కార్యాలయంలో బుధవారం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. మిషన్ భగీరథ ఈఈ రాజయ్య, డీఈఈలు సూర్య, రాజు, ఎంపీవో మధుసూదన్, ఏఈ లక్ష్మిపతి, పంచాయతీ కార్యదర్శి శశి తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

రఘునాథపల్లి : గ్రామాల్లో రక్షిత నీటిని పంపిణీ చేసేందుకు పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ అధికారులు అన్నారు. రఘునాథపల్లి మండల పరిషత్ కార్యాలయంలో వాటర్‌మెన్‌లకు శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ లలిత, ఎస్‌సీ కృష్ణయ్య, ఈఈ శ్రీకాంత్, డీఈ పద్మ, ఎంపీడీవో శ్రీనివాస్ సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏఈ అబ్దుల్‌హనమ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


నెల్లుట్లలో నగదు అందజేస్తున్న మిత్రులు

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: నెల్లుట్లలో ఇటీవల మృతి చెందిన కన్నెబోయిన ప్రభాకర్ కుటుంబ సభ్యులకు బుధవారం పిన్నింటి సత్యపాల్ రెడ్డి రూ.7500, మారబోయిన సందీప్ రూ.5016, శివ యూత్ సభ్యులు రూ.50,016 నగదు అందజేశారు. మొటికె సంపత్, సందీప్, వెంకటేశ్, రాజు, ఆంజనేయులు, జి.సంపత్, మధు, పాపయ్య, నవీన్, సోమరాజు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : సముద్రాల గ్రామానికి చెందిన చింతపండు రాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామానికి చెందిన గణేష్ యూత్ సభ్యులు బుధవారం రాజుకు రూ.18 వేల సాయం అందించారు. ప్రదీప్‌సేన రెడ్డి, పొడిశెట్టి యాదగిరి, ప్రసాద్, రమేష్, రాజు, సాంబరాజు, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్న ప్రభుత్వం'

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ సంస్థల కొమ్ము కాస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. తమ్మడపల్లి(జి)లో బుధవారం నిర్వహించిన సీపీఎం మహాసభలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు పార్టీ జెండాను నాయకుడు ఉప్పునూతన మల్లయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, సోమయ్య, సుధాకర్, వేల్పుల పెద్ద రాములు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య


మల్లేశం (పాతచిత్రం)

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో కిష్టగూడెం గ్రామానికి చెందిన మేకల మల్లేశం(48) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేశం మద్యానికి బానిసగా మారడంతో ఆయన భార్య మందలించేది. ఈ క్రమంలో మల్లేశం మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆయనను ఎంజీఎం ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన భార్య రేణుక ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్డీవో వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్ న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. శివునిపల్లి ఉన్నతపాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ జి.వేణు, ఎంపీడీవో విజయశ్రీ, ఎంఈవో కొమురయ్య, ప్రధానోపాధ్యాయుడు రమేష్, పీడీలు ప్రమోద్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వితే చర్యలు

చిల్పూర్, న్యూస్‌టుడే: మండలంలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ ఏడీ విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై నవీన్‌కుమార్, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో శంకర్, ఎంపీవో మధుసూదన్, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహాగర్జన సభను జయప్రదం చేయాలి

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: ఈ నెల 27న హైదరాబాద్‌లో జరగనున్న విద్యార్థి మహాగర్జన సభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పొదల లవకుమార్ ఆధ్వర్యంలో రఘునాథపల్లిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. సంఘం ప్రతినిధులు కందుకూరి వంశీ తేజ, రవికిరణ్, అజయ్, మానస, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: 2024-25 విద్యాసంవత్సరానికిగాను జనగామ జిల్లాలోని పలు ఐటీఐ కళాశాలల్లో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఐటీఐ కళాశాలల కన్వీనర్ బి.హరికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు https:///iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆసక్తి గలవారు ఈనెల 28న ఉదయం 11గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

రేపు 'వేస్ట్ టు వెల్త్' ప్రదర్శన

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ ఆదేశానుసారం రేపు(శుక్రవారం) 'వేస్ట్ టు వెల్త్' ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌జీసీ ఎకో క్లబ్ పాఠశాలల్లోని 60 బడుల నుంచి ఇద్దరు విద్యార్థులతో పాటు ఒక ఉపాధ్యాయుడు పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ప్రదర్శనలో ఏదైనా ఉత్పత్తిని ఆకర్షణీయంగా తయారు చేస్తే బహుమతులు అందజేస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ బహుమతిగా రూ.3వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2వేలు, తృతీయ బహుమతిగా రూ.1000 అందించనున్నట్లు వివరించారు.